# జన్యుమార్పిడి విత్తనాలు-మాన్‌శాంటో

**పర్యావరణ** పరిరక్షణ చట్టం-1989 ప్రకారం 'జనెటికల్ ఇంజనీరింగ్ అప్రైజల్ కమిటి'(జిఇఏసి) ఆమోదం లేకుండా, విచక్షణారహితంగా జన్యుమార్పిడి విత్తనాలను విడుదల చేయటాన్ని నిషేధిస్తున్నది. ఏమైనా, ప్రయోగశాలల నివేదికలు, గత అనుభవాల ఆధారంగా - జన్యుమార్పిడి పత్తి విత్తనాలలో చీడపీడలను, కాయతొలుచు పురుగులను నిరోధించే బహుళ జన్యు లక్షణాలు జమిలిగా కలిసి వున్నాయని, వీనిని గ్లైసెల్ బిటి పత్తి విత్తనాలుగా పిలుస్తున్నారని, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, మహారాష్ట్రలతో సహా అధికంగా పత్తి పండించే అనేక రాష్ట్రాలు ఈ విత్తనాలనే సాగుచేస్తున్నాయని తెలుస్తోంది.

కాయ తొలుచు పురుగును నిరోధించే బిటి-1, బిటి-2 విత్తనాలు ఇప్పటికే ఆమోదం పొంది మనదేశంలో సాగులో వున్నాయి. కొద్ది సం॥ల క్రితం ప్రత్తి సాగులో 90శాతం బిటి విత్తనాలనే వాడేవారు. ఇటీవల సంవత్సరాలలో రైతులు తిరిగి సంకరజాతి పత్తి విత్తనాలు వాడేందుకే మొగ్గు చూపుతున్నారు. బి.టి పత్తి దిగుబడి తగ్గిపోతూ వుండటం, బిటి పత్తి విత్తనాల వాడకం సూచీ కుంచించుకు పోతుండటం దీనికి కారణాలు. దీనికి అసలు అనుమతి మోన్‌శాంటోది కాగా, మనదేశ భాగస్వామి మహికోగా వుంది. మోన్‌శాంటో బిటి-3 రకం విత్తనాల ఆమోదం కొరకు దరఖాస్తు చేసుకుంది. కానీ జిఇఏసి భారతదేశంలో ఆ విత్తనాల సాగుకు నిరాకరించింది.

గ్లైసెల్ బిటి లేక 'రౌండప్ రడీఫ్లెక్స్' పేరుతో సింజెంటా రూపొందించి, అభివృద్ధిచేసిన విత్తనాలను క్షేత్ర ప్రయోగంద్వారా అనుమతి లేకుండానే మహికో భారతదేశంలో ప్రవేశపెట్టింది. భారత రైతులకు గ్లైసిల్ బిటి పత్తి విత్తనాల సరఫరాదారులుగా వున్న మహికో, మాన్‌శాంటోలను అనుమానించటం సబబైనది.

మాన్‌శాంటో, మహికోలపై కఠిన చర్య తీసుకోవాలని ఆల్ ఇండియా కిసాన్ సభ జిఇఏసికి విజ్ఞప్తి చేయగా, మెరుగైన నాణ్యతగల విత్తనాలను సరఫరా చేయాలన్న రైతుల విజ్ఞప్తిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గ్లైసిల్ బిటిపత్తి సమర్థతను 'నిర్ధారించేందుకు' ఓ కమిటిని నియమించటం దుర్మార్గమైనది. ఈ అంశంపై నిర్ణయం తీసుకోవటానికి జిఇఏసి అన్న ఓ చట్టబద్ధ సంస్థ వుండగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరొక కమిటిని ఏర్పాటు చేయవలసిన అవసరమే మొచ్చింది? ఇది, రైతులను దోచుకునేందుకు మరోసారి మాన్‌శాంటోను ప్రవేశపెట్టే కపటోపాయం మినహా మరోటి కాదు.

ooooo